తప్పు ఒప్పుకో రేవంత్

- హెచ్‌సీయూ భూముల్లో రూ.10 వేల కోట్ల స్కామ్
- అడవుల ధ్వంసం పర్యావరణ చట్టాల ఉల్లంఘనే అవుతుంది
- అడవిని పునరుద్ధరించకుంటే అధికారులకు శిక్ష తప్పదు
- సీఎం రేవంత్ మూర్ఖత్వంతో అధికారులు జైలుకు వెళ్లాలా?
- కేటీఆర్ మండిపాటు

హైదరాబాద్, మే 15 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో సీఎం రేవంత్‌రెడ్డి తన తప్పు ఒప్పుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు విచారణ సందర్భంగా అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై గురువారం ఎక్స్ వేదికగా స్పందించారు. ప్రభుత్వం తరపున వాదిస్తున్న అడ్వకేట్‌ను హెచ్చరించిన సుప్రీంకోర్టు, కంచ గచ్చిబౌలి అడవుల విధ్వంసానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు పలువురు అధికారులను జైలుకు పంపించాలా? అంటూ హెచ్చరించిన విషయాన్ని ప్రస్తావించారు. ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన తప్పులకు తెలంగాణ ప్రభుత్వ అధికారులు శిక్ష ఎదుర్కొనే పరిస్థితి నెలకొన్నదని కేటీఆర్ విచారం వ్యక్తంచేశారు. తెలంగాణ ప్రభుత్వ అధికారులకు సుప్రీంకోర్టు హెచ్చరికలు జారీ చేయడంపై ఆవేదన వ్యక్తంచేశారు. రేవంత్‌రెడ్డి మూర్ఖత్వం వల్ల అధికారులు జైలు పాలు కావాల్సి వస్తుందని వాపోయారు. అన్నింటికీ తాను బాధ్యుడిని కాదని రేవంత్‌రెడ్డి తప్పించుకునే అవకాశం లేనే లేదని స్పష్టంచేశారు. సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలపై, కంచ గచ్చిబౌలి వ్యవహారంలో రేవంత్‌రెడ్డి చేసిన తప్పులను ఒప్పుకోవాలని డిమాండ్ చేశారు. వందల బుల్డోజర్లతో ధ్వంసం చేసిన కంచ గచ్చిబౌలి అడవులను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే రేవంత్‌రెడ్డికి కోర్టు శిక్షలు తప్పవని హెచ్చరించారు.

అది ముమ్మాటికీ అవినీతే

కంచ గచ్చిబౌలి భూములను అమ్మి రూ.10 వేల కోట్ల రూపాయల స్కామ్ చేశారని, ఇది ముమ్మాటికీ అవినీతి, నమ్మక ద్రోహమే అవుతుందని కేటీఆర్ ఆరోపించారు. సెలవు రోజుల్లో బుల్డోజర్లను పంపి అండవులను ధ్వంసం చేయడం కూడా పర్యావరణ చట్టాల ఉల్లంఘనే అవుతుందని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి బాధ్యతారాహిత్య చర్యల ఫలితంగా పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగిందని మండిపడ్డారు. కంచ గచ్చిబౌలి భూములను ప్రభుత్వం కాపాడాల్సిందేనని, ఇప్పటికైనా రేవంత్‌రెడ్డి తాను సృష్టించిన విధ్వంసానికి, తన బాధ్యతారాహిత్యానికి, చేసిన రూ.10 వేల కోట్ల స్కామ్‌కు బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా అంకిరెడ్డిపల్లె గ్రామంలో కురుమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన బీరప్ప కల్యాణ వేడుకలకు హాజరైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్

బీరప్ప దయతో సుఖశాంతులతో ఉండాలి

పాడి, పంటలు సమృద్ధిగా పండాలి .. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

రాజన్న సిరిసిల్ల, మే 15 (నమస్తే తెలంగాణ) : 'వర్షాలు కురవాలి.. నదులు పారాలి.. పంటలు పండి పశుసంపద పెరగాలి.. కాలం మంచిగై బీరప్ప దయతో రాష్ట్ర ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలి' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆకాంక్షించారు. జీవసంపద దినదినాభివృద్ధి చెందాలని, శాంతి భద్రతలు బాగుండాలని కోరుకున్నారు. సిరిసిల్ల నియోజకవర్గంలో గురువారం ఆయన విస్తృతంగా పర్యటించారు. హైదరాబాద్ నుంచి సాయంత్రం నాలుగున్నర గంటలకు తంగళ్లపల్లి మండలం అంకిరెడ్డిపల్లెకు చేరుకుని బీరప్ప కల్యాణ వేడుకలకు హాజరయ్యారు. అక్కడి నుంచి సిరిసిల్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకుని పార్టీ కార్యకర్తలతో ముచ్చటించారు. రాత్రి 7 గంటలకు సిరిసిల్ల అర్బన్ మండలం పెద్దూరులో కార్యకర్త దేవగౌడ కూతురు వివాహం కాగా, ఆయన నివాసానికి వెళ్లి వధూవరులను ఆశీర్వదించారు. ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామానికి చేరుకుని దర్శావలీ దర్గా ఉర్సు ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగ వాతావరణంలో జరుగుతున్న బీరప్ప ఉత్సవాలకు హాజరు కావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. బీరప్ప ఆశీస్సులతో అందరూ చల్లంగా ఉండాలని ఆకాంక్షించారు.

కోర్టులనే తప్పదోవ పట్టిస్తున్న రేవంత్

- ఎప్పటికప్పుడు తప్పపడుతున్న కోర్టులు.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద

హైదరాబాద్, మే 15 (నమస్తే తెలంగాణ): రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలనే కాదు.. న్యాయస్థానాలను సైతం తప్పుదోవ పట్టిస్తున్నదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. కంచె గచ్చిబౌలి భూముల విషయంలో తాజాగా సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసిందని తెలిపారు. ఫ్రస్ట్రేషన్‌లో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి.. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సీఎం అన్న మాటలతో ప్రజలు నవ్వుకుంటున్నారని పేర్కొన్నారు. ఆయన అనాలోచిత, అనుభవరాహిత్య నిర్ణయాలతో ప్రజలు సతమతం అవుతున్నారని చెప్పారు.

ఉద్దేశపూర్వక విధ్వంసం

- 71 ఎకరాల అడవిని నిర్మూలించింది
- నిబంధనలను తుంగలో తొక్కిన సర్కారు
- జీవావరణ వ్యవస్థకు పూడ్చలేని నష్టం
- కంచ గచ్చిబౌలిపై సీఈసీ నివేదిక

హైదరాబాద్, మే 15 (నమస్తే తెలంగాణ): కంచ గచ్చిబౌలిలో ప్రభుత్వం విధ్వంసానికి పాల్పడిందని , నిబంధనలను తుంగలో తొక్కిందని సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ (సీఈసీ) స్పష్టంచేసింది. కంచ గచ్చిబౌలి భూములపై అధ్యయనం చేయాలన్న సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సీఈసీ ఇటీవల రాష్ట్రంలో పర్యటించింది. గురువారం సుప్రీంకోర్టుకు నివేదిక అందజేసింది. కంచ గచ్చిబౌలి మొత్తం విస్తీర్ణం 409.12 ఎకరాలు కాగా.. ప్రభుత్వం బుల్డోజర్లు పెట్టి మొత్తం 104.95 ఎకరాల్లో చెట్ల నరికివేతకు పాల్పడినట్టు చెప్పింది. ఇందులో 71 ఎకరాల్లో అడవి విస్తరించి ఉండేదని, దీనిని ప్రభుత్వం పూర్తిగా నిర్మూలించినట్టు సీఈసీ తెలిపింది. ప్రభుత్వం కంచ గచ్చిబౌలిలో కేవలం అడవిని నాశనం చేయలేదని, ప్రజల నమ్మకాన్ని, రాజ్యాంగబద్ధ విధులను, సుప్రీంకోర్టు ఆదేశాలను అవమానించిందని అభిప్రాయపడింది.

జీవావరణ వ్యవస్థకు తీరని నష్టం

కంచ గచ్చిబౌలి భూముల్లో అద్భుతమైన జీవావరణ వ్యవస్థ ఉన్నదని సీఈసీ స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం 104 ఎకరాల్లో అడవులను ధ్వంసం చేయడంతో అక్కడి జీవావరణ వ్యవస్థకు, జంతుజాతికి పూడ్చలేని నష్టం వాటిల్లినట్టు స్పష్టం చేసింది. రాష్ట్ర అటవీ శాఖ ఇచ్చిన నివేదిక ప్రకారం.. కాంట్రాక్టర్ 104 ఎకరాల్లోని 1,399 అనుమతి పొందిన చెట్లను, 125 అనుమతి లేని చెట్లను నరికివేసినట్టు చెప్పింది. ఆర్టికల్ 48ఏ, ఆర్టికల్ 21 ప్రకారం ప్రభుత్వ భూములు, వనరులను రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంటుందని గుర్తు చేస్తూ.. కంచ గచ్చిబౌలిలో ఆ బాధ్యతల్లో విఫలం కావడం నేరంతో సమానమని అభిప్రాయపడింది.

ఎందుకు వెనక్కి తీసుకున్నట్టు?

మరోవైపు రాష్ట్రంలో 43 లక్షల ఎకరాల అటవీ భూములు ఉన్నాయని ప్రభుత్వం నిరుడు ఏప్రిల్‌లో కేంద్ర పర్యావరణ శాఖకు సమాచారం ఇచ్చింది. రెండు నెలల్లోనే ఆ నివేదికను ఉపసంహరించుకున్నది. కొన్ని సాంకేతిక కారణాల వల్ల ఉపసంహరించుకుంటున్నట్టు సీఈసీ తన నివేదికలో పేర్కొన్నది. దీంతో అటవీ భూముల లెక్కలను తారుమారు చేసేందుకే ప్రభుత్వం ఈ చర్యకు పాల్పడిందన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మరోవైపు రాష్ట్రంలోని అటవీ ప్రాంతాలను గుర్తించేందుకు ప్రభుత్వం ఈ ఏడాది మార్చిలో నియమించిన కమిటీలో నిపుణులు లేరని సీఈసీ అభిప్రాయపడింది. కమిటీని పునర్నియమించాలని సూచించింది. భూములను రక్షించాలన్న సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వం ఆలస్యంగా మేల్కొన్నట్టు తెలిపింది.

సీఈసీ సూచనలు

1. ఈ భూమిని తక్షణమే అరణ్యంగా ప్రకటించి, రక్షణ బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలి.
2. 104.95 ఎకరాల్లో భారీగా మొక్కలు పెంచి పూర్వ స్థితికి తీసుకురావాలి.
3. జీవావరణం, అరుదైన వృక్ష, జంతుజాతి వంటివాటిని దృష్టిలో ఉంచుకొని ఈ ప్రాంతాన్ని రిజర్వ్ ఫారెస్ట్‌గా ప్రకటించాలి.
4. ఈ ప్రాంతంలోని జలాశయాలను సంరక్షించాలి.
5. ఈ ప్రాంతంలోకి మురుగునీరు రాకుండా ఏడాదిలోపు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి.
6. అటవీ పరిరక్షణ కమిటీని పునర్నిర్మించాలి. శాస్త్రవేత్తలు, రిమోట్ సెన్సింగ్ నిపుణులను కమిటీలో చేర్చాలి.
7. రాష్ట్రంలోని ప్రభుత్వ భూముల్లో అటవీ తరహా ప్రాంతాలను గుర్తించేందుకు అత్యున్నత స్థాయి కమిటీని నియమించాలి.
8. ఈ నివేదిక తయారు చేయడానికి ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియాకు రూ.14.52 లక్షలు ఖర్చయింది. ఈ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం తిరిగి చెల్లించాలి.

కంచను పునరుద్ధరిస్తారా.. జైలుకెళ్తారా?

మొదటిపేజీ తరువాయి...

చేసింది. సుదీర్ఘ వారాంతపు సెలవుల సమయంలో, కోర్టులు అందుబాటులో లేని పరిస్థితిని అవకాశంగా తీసుకొని చెట్లను ధ్వంసం చేయాల్సిన అవసరమేమొచ్చిందని ధర్మాసనం నిలదీసింది. 'ప్రాథమికంగా చూస్తే, ముందస్తు ప్రణాళిక ప్రకారమే జరిగినట్టు తెలుస్తున్నది. వరుసగా 3 రోజులు సెలవులు వస్తున్నాయి, కోర్టులు పనిచేయవని మీకు తెలుసు' అని సీజేఐ ఆగ్రహం వ్యక్తం చేశారు. కంచ గచ్చిబౌలిలో అటవీ ప్రాంతం ధ్వంసం చేయడాన్ని సుమోటోగా స్వీకరించిన సుప్రీంకోర్టు అక్కడ యథాతథ స్థితిని కొనసాగించాలని గత ఏప్రిల్ 3న ఆదేశించింది.

కోర్టు ఏం చెప్పినా వింటాం

ఈ కేసులో గురువారం జరిగిన విచారణ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి వాదనలు వినిపించారు. కంచె గచ్చిబౌలిలో ప్రభుత్వం తన కార్యకలాపాలను మొత్తం నిలిపివేసిందని చెప్పారు. సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చే ఆదేశాలను 'తు చ' తప్పకుండా పాటిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ధర్మాసనం జోక్యం చేసుకుంటూ 'అటవీ పునరుద్ధరణకు ప్రభుత్వం వద్ద ఏదైనా ప్రణాళిక ఉందా? లేదా?' అని ప్రశ్నించింది. ఆ ప్రాంతంలో భారీస్థాయిలో మొక్కల పెంపకం చేపడుతున్నట్టు సింఘ్వీ చెప్పారు. రాబోయే వానకాలంలో ఈ ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. దీనిపై అమికస్ క్యూరీ, సీనియర్ న్యాయవాది కే పరమేశ్వర్ స్పందిస్తూ.. ధ్వంసం

చేసిన ప్రాంతంలో మొక్కలు నాటడం లేదన్నారు. కంచె గచ్చిబౌలిలో జరిపిన విధ్వంసంపై ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా ఉపగ్రహ చిత్రాల సాయంతో సర్వే చేసి ఇటీవల కేంద్ర సాధికార కమిటీ (సీఈసీ)కి నివేదిక ఇచ్చిందని చెప్పారు. దీని ప్రకారం ధ్వంసమైన 104 ఎకరాల్లో 60 శాతం భూమిలో ఓ మోస్తరు నుంచి దట్టమైన అటవీ ప్రాంతం ఉన్నదని తెలిపారు. దీనిపై జస్టిస్ గవాయ్ స్పందిస్తూ 'కోర్టు ధిక్కరణ అభియోగం నుంచి తప్పించుకోవాలంటే అడవిని పునరుద్ధరించాలన్న నిర్ణయం తీసుకోవడం మంచిది' అని ప్రభుత్వ న్యాయవాదిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

సమర్థించుకుంటే ఇబ్బందుల్లో పడతారు

'ఇప్పటికైనా జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నాం. ఇటువంటి చర్యను సమర్థించుకోవాలని చూస్తే, సీఎస్‌తోపాటు చెట్లను ధ్వంసం చేయడంలో భాగస్వాములైన అధికారులందరూ ఇబ్బందుల్లో పడతారు' అని హెచ్చరించారు. సుదీర్ఘ వారాంతాన్ని అవకాశంగా మలచుకొని ఇటువంటి పని చేసి ఉండాల్సింది కాదు అని అన్నారు. ధ్వంసమైన అటవీ ప్రాంతానికి సంబంధించిన ఫొటోలను ప్రస్తావిస్తూ.. చెట్లను నరికివేసే ముందు పర్యావరణ అనుమతులు తీసుకున్నారా? అని ప్రశ్నించారు. 'ఒకవేళ అనుమతులు తీసుకొని ఉంటే పనులను సోమవారం నుంచి ఎందుకు ప్రారంభించలేదు' అని నిలదీశారు. ఈ సందర్భంగా సింఘ్వీ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసిందని చెప్పారు. తమ ప్రధానకార్యదర్శితోపాటు మరో అరడజను అధికారులను తాత్కాలిక జైలుకు పంపాలా లేదా అన్నది రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయమని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఒకవేళ అక్కడ అడవిని పునరుద్ధరించదలచుకుంటే ఆ పనిని వచ్చే వానకాలంలో చేపట్టవచ్చునని మరో న్యాయవాది సూచించారు. ప్రభుత్వం సమర్పించిన అఫిడవిట్‌లో తమ చర్యను సమర్థించుకున్నదని, అక్కడ ఐటీ నిర్మాణంతో ముందుకెళ్లనున్నట్టు స్పష్టం చేసిందని తెలిపారు. అడవి పునరుద్ధరణకు ఎటువంటి ప్రణాళికను ప్రభుత్వం కోర్టు ముందుంచలేదని చెప్పారు. దీనిపై సింఘ్వీ జోక్యం చేసుకుంటూ.. అక్కడ పర్యావరణ పరిరక్షణ, ఐటీ రెండూ కొనసాగేలా కోర్టును ఒప్పించేందుకు ప్రయత్నిస్తానని అన్నారు. దీనిపై సీజేఐ స్పందిస్తూ.. 'సుస్థిర అభివృద్ధికి మేము వ్యతిరేకం కాదు. కానీ ఇక్కడ వారాంతపు సెలవులను అడ్డుపెట్టుకొని వేలాది చెట్లను నరకడం గురించి మాత్రమే మేం మాట్లాడుతున్నాం' అన్నారు. ప్రభుత్వం చేసిన పనిని సమర్థించుకోవద్దని, ధ్వంసం చేసిన ప్రాంతంలో అటవిని పునరుద్ధరిస్తారో లేదో చెప్పాలని స్పష్టం చేశారు. మరో న్యాయవాది జోక్యం చేసుకుంటూ.. అక్కడ అడవిని రక్షించాలనుకున్న విద్యార్థుల పక్షాన ఒక దరఖాస్తును కోర్టుకు నివేదించినట్టు చెప్పారు. వర్సిటీలో పరీక్షలు జరుగుతుండగా, విద్యార్థులు ఎఫ్ఐఆర్‌లను ఎదుర్కొంటున్నారని తెలిపారు. దీనికి సంబంధించి ప్రత్యేకంగా పిటిషన్ దాఖలు చేయాలని, ప్రస్తుతానికి తాము అడవి పునరుద్ధరణపైనే దృష్టి సారిస్తున్నామని, దీని పరిధిని పెంచవద్దని ధర్మాసనం స్పష్టం చేసింది. అనంతరం కేసు తదుపరి విచారణను జూలై 23కు వాయిదా వేసింది.

పునరుద్ధరణ శాస్త్రీయంగా ఉండాలి: విద్యార్థులు

కంచ గచ్చిబౌలి పరిధిలోని హెచ్‌సీయూ భూముల్లో ప్రభుత్వం చేపట్టే పనురుద్ధరణ పనుల్లో యూనివర్సిటీ ప్లాంట్ సైన్స్ ప్రొఫెసర్లను, తమను భాగస్వామ్యం చేయాలని విద్యార్థులు కోరారు. ఎకాలజిస్టులు, ప్లాంట్ సైన్స్ ప్రొఫెసర్లు సూచించిన మొక్కలనే నాటాలని డిమాండ్ చేశారు. మొక్కలను నాటే క్రమంలో శాస్త్రీయ పద్ధతులను అవలంబించాలని పేర్కొన్నారు.

మహిళా మంత్రులే కాళ్లు కడగాల్సింది!

మొదటిపేజీ తరువాయి...

బాధాకరమని ఆవేదన వ్యక్తంచేశారు. తెలంగాణ మహిళాలోకానికి ముఖ్యమంత్రి రేవంత్ ప్రభుత్వం క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. 'మా ఆడబిడ్డలతో ప్రపంచ అందాల పోటీదారుల కాళ్లు కడిగించడం సిగ్గుచేటు.. ఇందుకు బాధ్యుడైన మీ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో క్షమాపణలు చెప్పించండి' అంటూ కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియాగాంధీని డిమాండ్ చేస్తూ మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, సునీతాలక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే కోవ లక్ష్మి గురువారం సంయుక్తంగా ఆమెకు లేఖ రాశారు.

కాంగ్రెస్ సర్కార్‌కు ఆడబిడ్డల ఉసురు తాకుతది : సబిత

మహిళల ఆత్మగౌరవాన్ని పెంచుతామని గొప్పలు చెప్పే కాంగ్రెస్ ప్రభుత్వం, తెలంగాణ ఆడబిడ్డలతో విదేశీయుల కాళ్లు కడిగించడం దేనికి సంకేతమని మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి ధ్వజమెత్తారు. ఓవైపు రాష్ట్రంలోని మహిళలు తాగునీటి కోసం కిలోమీటర్ల కొద్దీ రాళ్లు రప్పల్లో నడుచుకుంటూ వెళ్తుంటే, మరోవైపు విదేశీ అందగత్తెల కాళ్లు కందిపోకుండా రెడ్ కార్పెట్లు వేసి స్వాగతం పలకడం.. వాళ్ల కాళ్లు కడిగించి టవల్‌తో తుడిపించడం బాధాకరమని వాపోయారు. ఆడబిడ్డల ఉసురు తగిలి కాంగ్రెస్ ప్రభుత్వం కుప్పకూలక తప్పదని ఎక్స్ వేదికగా మండిపడ్డారు. తెలంగాణ మహిళాలోకానికి రాష్ట్ర ప్రభుత్వం క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

ఆ జిల్లా మంత్రులతో కడిగించకపోయారు? : గొంగిడి సునీత

అందాల పోటీల కోసం వచ్చిన సుందరీమణుల కాళ్లను తెలంగాణ ఆడబిడ్డలతో కడిగించడమే కాకుండా ఇది మన సంప్రదాయమని ప్రభుత్వం చెప్పుకోవడం సిగ్గుచేటని, అంత సంప్రదాయమే అయితే వరంగల్ జిల్లాలోని ఇద్దరు మహిళా మంత్రులతో వారి కాళ్లు కడిగిస్తే బాగుండేదని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత ఆగ్రహం వ్యక్తంచేశారు. తెలంగాణ భవన్‌లో ఆమె విలేకరులతో మాట్లాడుతూ బతుకమ్మ అంటే తెలంగాణ ఆడబిడ్డలకు దేవత అని, మనమంతా ఎంతో భక్తిశ్రద్ధలతో కొలిచే బతుకమ్మ చుట్టూ అందగత్తెలంతా చెప్పులు వేసుకొని ఆడారని, ఇదేనా సంప్రదాయమని నిలదీశారు. ఆడబిడ్డల జోలికి వస్తే రేవంత్‌రెడ్డి పతనం తప్పదని ధ్వజమెత్తారు. సరస్వతి పుష్కరాల్లో రేవంత్‌రెడ్డి దంపతుల కటౌట్ కింద అమ్మవారి ఫొటో పెట్టారని, రేవంత్‌కు ఇంత అహంకారం ఎందుకని ప్రశ్నించారు. ఫార్ములా ఈ రేసు కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.40 కోట్లు ఖర్చుపెడితే కేసులు పెట్టారని, మరి రూ.200 కోట్లతో కాంగ్రెస్ ప్రభుత్వం అందాల పోటీలను ఎందుకు నిర్వహిస్తున్నదని మండిపడ్డారు.

బయటి వాళ్ల కాళ్లు కడిగే సంప్రదాయం ఎక్కడిది? : స్రవంతి

బీఆర్ఎస్ నాయకురాలు పాల్వాయి స్రవంతి మాట్లాడుతూ 'మన తల్లిదండ్రులు, గురువు, ఇంటి అల్లుడి కాళ్లు కడిగే సంప్రదాయం ఉన్నది. వీళ్లు ఏం గొప్పలు సాధించారని సుందరాంగుల కాళ్లు కడిగించిండ్రు? ఇది తెలంగాణ సంప్రదాయమా? తెలంగాణలో ఆడవాళ్ల కాళ్లు కడిగే సంప్రదాయం ఉన్నదా అసలు?' అని నిలదీశారు. చౌమహల్లా ప్యాలెస్‌లో సుందరీమణుల కోసం లంచ్ ఏర్పాటు చేసిన ప్రభుత్వం.. ఒక్కో ప్లేట్‌కు రూ.లక్ష ఖర్చు చేసిందని ధ్వజమెత్తారు. తెలంగాణ ఆడబిడ్డలకు మహాలక్ష్మి పథకం ఇవ్వడం మాత్రం ఈ ప్రభుత్వానికి చేతకావడం లేదని మండిపడ్డారు.

సోనియాకు లేఖ

'కాంగ్రెస్ 18 నెలల పాలనలో తెలంగాణ మహిళలకు అడుగడుగునా అవమానాలు జరుగుతున్నయి.. మా ఆడబిడ్డలతో ప్రపంచ అందాల పోటీదారుల కాళ్లు కడిగించడం సిగ్గుచేటు.. ఇందుకు బాధ్యుడైన మీ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో క్షమాపణలు చెప్పించండి' అంటూ కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియాగాంధీని డిమాండ్ చేస్తూ ఆమెకు మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, సునీతా లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే కోవ లక్ష్మి గురువారం సంయుక్తంగా లేఖ రాశారు. రాష్ట్రంలో మహిళలకు కాంగ్రెస్ సర్కారు చేస్తున్న మోసాలు, ఎగ్గొట్టిన మ్యానిఫెస్టో హామీలు, జరుగుతున్న అవమానాలు, ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్న తీరును ఏకరువు పెట్టారు. యునెస్కో గుర్తింపుతో విశ్వఖ్యాతిని దక్కించుకున్న రామప్ప ఆలయం సాక్షిగా తెలంగాణ ఆడబిడ్డలతో మిస్ వరల్డ్ పోటీదారుల కాళ్లను కడిగించడం తీవ్ర దుమారానికి దారితీసిందని ప్రస్తావించారు. మా ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని అందాల పోటీదారుల పాదాల చెంతన ఉంచడం బాధాకరమని వాపోయారు. ఈ ఘటన నాలుగుకోట్ల తెలంగాణ ప్రజలకు అంతులేని వేదనను మిగిల్చిందని ఉటంకించారు. మహిళా సాధికారత దిశగా అనేక పథకాలు అమలుచేస్తున్నామని ఓ వైపు గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం ఇలా దిగజారి వ్యవహరించడం దుర్మార్గమని పేర్కొన్నారు. సీఎం రేవంత్ చేష్టలు తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను అవమానించేలా ఉన్నాయని, ప్రపంచం ముందు తెలంగాణ ఖ్యాతిని మంటగలిపేలా ఉన్నాయని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. 'దశాబ్దాలపాటు సాగిన తెలంగాణ పోరాటం, అమరవీరుల త్యాగాల గురించి అవగాహన ఉన్న మీరు.. మీ ముఖ్యమంత్రి పిచ్చి పనులను నియంత్రించాలి. వెంటనే మా అక్కాచెల్లెళ్లకు క్షమాపణలు చెప్పించాలి' అని డిమాండ్ చేశారు. లేదంటే కాంగ్రెస్ సర్కారుపై మహిళలు తిరగబడే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు.

- కేసీఆర్ కట్టించిన యాదాద్రి

యాదాద్రికి అందాలభామలు

'యాదగిరిగుట్ట శిల్ప కళ అద్భుతం..రాతి కట్టడం అద్వితీయం.. అమోఘం. అబ్బురపడేలా ఆలయాన్ని తీర్చిదిద్దారు' అని మిస్ వరల్డ్ పోటీదారులు పరవశించిపోయారు. గురువారం యాదాద్రి భువనగిరి జిల్లాలోని యాదగిరిగుట్ట, భూదాన్ పోచంపల్లిని సుందరీమణులు సందర్శించారు.–యాదాద్రి భువనగిరి

- యాదగిరిగుట్ట కొండపైన భక్తుల ఘర్షణ

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి కొండపైన బస్టాండ్ వద్ద గురువారం భక్తుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ప్రపంచ సుందరీమణుల పర్యటన నేపథ్యంలో దర్శనానికి వచ్చిన భక్తులు వెంటనే కొండకిందికి వెళ్లాలని పోలీసులు ఆదేశించారు. బస్సులు లేక బస్టాండ్‌లో వేచి ఉన్న భక్తులు బస్సును ఎక్కేందుకు ప్రయత్నిస్తుండగా వెనుకనే ఉన్న మరికొంత మంది భక్తులు కొందరిని లాగి కిందికి దింపే ప్రయత్నం చేశారు. దీంతో సహనం కోల్పోయిన భక్తులు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. –యాదగిరిగుట్ట

లోకం పోకడ



ఎండా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
నల్లగొండ	39.5°c	24.4°c
రంగారెడ్డి	39.5°c	20.5°c
నిజామాబాద్	38.8°c	27.1°c
ఆదిలాబాద్	38.5°c	27.0°c
మెదక్	38.3°c	20.6°c
వరంగల్	38.0°c	25.0°c
ఖమ్మం	37.0°c	26.0°c
కరీంనగర్	36.0°c	27.0°c
మహబూబ్‌నగర్	36.0°c	26.0°c
హైదరాబాద్	35.6°c	22.8°c

వరద కాపొద్దని ప్లేట్లిచ్చినం

- వివాదంపై మంత్రి సీతక్క వివరణ

హైదరాబాద్, మే 15 (నమస్తే తెలంగాణ): మిస్ వరల్డ్ కంటెస్టెంట్ల కాళ్లను తెలంగాణ ఆడబిడ్డలు కడిగినట్టుగా వస్తున్న వార్తలపై మంత్రి సీతక్క వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. ఈ మేరకు గురువారం వీడియో విడుదల చేశారు. 'గుడి ప్రాంగణంలో 33 మంది ప్రపంచ సుందరీమణులు ఒకేసారి కాళ్లు కడుక్కుంటే నీళ్లు వరదలా పారి.. బురదైతదన్న ఉద్దేశంతో ప్రభుత్వం వాళ్లు కాళ్లు కడుక్కోవడానికి ప్లేటు, చెంబు ఎవరిది వారికి ఇచ్చింది. ఈవెంట్ మేనేజ్‌మెంట్‌కు చెందిన ఓ అమ్మాయి ఒకరికి చెంబుతో నీళ్లు పోయడం, ఇంకేదో చేసినంత మాత్రాన రాద్ధాంతం చేస్తున్నరు. గుడిలోకి కాళ్లు కడుక్కొని వెళ్లడం గిరిజన సంప్రదాయం. అక్కడ అదే పాటించారు' అని వీడియో ద్వారా మంత్రి తెలిపారు. మిస్ వరల్డ్ కంటెస్టెంట్ల రామప్ప పర్యటనను వివాదాస్పదం చేయడం సరి కాదని చెప్పారు.

మంత్రి సీతక్కా..నోరు జాగ్రత్త!

- బీఆర్ఎస్ నేత పటోళ్ల కార్తీక్‌రెడ్డి

హైదరాబాద్ మే 15 (నమస్తేతెలంగాణ): మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని ఉద్దేశించి 'అబద్ధాలకు అంబాసిడర్‌గా మారకు' అంటూ మాట్లాడిన మంత్రి సీతక్కకు బీఆర్ఎస్ నేత పటోళ్ల కార్తీక్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు.' సీతక్కా...నోరు జాగ్రత్త..మీరు మాట్లాడేది ఓ మహిళ గురించి అనే విషయం మర్చిపోయారా?' అని గురువారం ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. సర్కారు తప్పిదాన్ని కప్పిపుచ్చుకొనేందుకు మిస్‌వరల్డ్ కంటెస్టెంట్ కాళ్లు